
సాక్షి
సిద్దిపేట
శనివారం । 3 । జూన్ । 2023



కిలేడి

అధిక వడ్డీ ఆశ చూపిన ఓ కిలాడీ లేడి రైతు దంపతుల వద్ద నుంచి రూ.41.40 లక్షలు తీసుకుంది. తీసుకున్న డబ్బు ఇవ్వాలని అడిగేతే డబ్బు ఇవ్వలేదంటూ బుకాయిస్తుంది.

ఆర్డీఓ సమావేశం

కోహెడ(హుస్నాబాద్): ఎన్నికల వక్రియలో భాగంగా హుస్నాబాద్ ఆర్డీఓ బెన్ షాలోమ్ కోహెడ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు లిస్టు జాబితాను క్షుణంగా పరిశీలించిన అనంతరం సరైన ఆధారాలతో ఆమోదం, తిరస్కరణ చేయాలని సూచించారు.

4న సురక్షా దినోత్సవం

సిద్దిపేటకమాన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 4వ తేదీన సురక్షా దినోత్సవం నిర్వహించనున్నట్లు సీపీ శ్వేత తెలిపారు. గజ్వేల్, దుబ్బాక, చేర్యాల పోలీస్ స్టేషన్లలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలన్నారు. కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని సీపీ తెలిపారు.

విశ్వ బ్రాహ్మణ భవనానికి స్థలం కేటాయించాలి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో విశ్వ బ్రాహ్మణుల భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం విశ్వబ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు సర్వోజి నర్సింహ్మాచారి ఆధ్వర్యంలో సర్పంచ్ పాల్కంపల్లి జయంతి, కమిటీ సభ్యులు నెరెళ్ల నర్సింహ్మాచారి, యాలాల సత్యనారాయణలు మంత్రి హరీశ్‌రావుకు వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలిసినవారిలో పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకులు పాల్కంపల్లి నరేందర్, మాజీ సర్పంచ్ కాచం నవీన్‌కుమార్, సంతోష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ డివిజన్ సాధనకు ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర అవతరణ దినోత్సవ స్ఫూర్తితో చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకు ఉద్యమించాలని జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్, కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ గిరి కొండల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఓ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేర్యాల నియోజకవర్గ కేంద్రం, తాలూకాగా వెలుగొందిందని, ఎమ్మెల్యేలు, మంత్రులుగా ఎంతో మంది ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించారన్నారు. రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో సైతం ప్రత్యేక పాత్ర పోషించిందన్నారు. నాడు రాష్ట్ర సాధనకోసం ఎలాంటి పోరాటం చేశామో అదే తరహాలో ఉద్యమించాలన్నారు. ఆగంరెడ్డి, మల్లారెడ్డి, అశోక్, నర్సింగరావు, కళావతి, యాదయ్య, లింగం, రమణారెడ్డి, రాజు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం భారతీయ జనతా పార్టీ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్‌గౌడ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పట్టణ, చేర్యాల రూరల్, కొమురవెల్లి, మద్దూరు, దూళ్మిట్ట మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో సురేష్‌గౌడ్ మాట్లాడారు.









మంత్రికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

ములుగు(గజ్వేల్): ములుగు మండలం వంటిమామిడిలో క్షీర సాగర్ కేటీఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొన్యాల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి తన్నీరు హరీష్‌రావుకు ముందస్తు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, వంటి మామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, మండల పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాషా, మురళీధర్‌రెడ్డి, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి గ్రామ పంచాయితీ సర్పంచ్ దంపతులు పాల్కంపల్లి జయంతి నరేందర్, మాజీ సర్పంచ్ కాచం నవీన్ కుమార్, గ్రామ అధ్యక్షుడు మల్లం ఐలయ్య, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, రవీందర్‌లతో పాటు మరికొందరు మంత్రి హరీశ్‌రావుకు బొకె అందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ దంపతులు పాల్కంపల్లి జయంతి నరేందర్ దంపతులు మంత్రి హరీశ్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు మాజీ సర్పంచ్ కాచం నవీన్ కుమార్, గ్రామ అధ్యక్షుడు మల్లం ఐలయ్య, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, రవీందర్‌లతో పాటు మరికొందరు మంత్రి హరీశ్‌రావుకు బొకె అందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ముందస్తు సంబురాలు

సిద్దిపేటజోన్: రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టీ. హరీశ్‌రావుకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ సందడితో క్యాంపు కార్యాలయం కిటకిటలాడింది. శనివారం మంత్రి పుట్టినరోజు నేపథ్యంలోశుక్రవారం పట్టణంలో పర్యటించిన మంత్రికి అభిమానులు, నాయకులు, అధికారులు, కార్యకర్తలు ఒకరోజు ముందు అభినందించారు.





క్లుప్తంగా

కలెక్టరేట్‌లో అవతరణ వేడుకలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

సిద్దిపేటరూరల్: దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. గ్రామీణ, పట్టణ అభివృద్ధి కార్యక్రమాల్లో దేశ స్థాయిలో సిద్దిపేట జిల్లా అవార్డులు సాధిస్తూ మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు.అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

పిన్నింటికి జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ప్రకాశ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాకు చెందిన కళాకారుడు డాక్టర్ పిన్నింటి ప్రకాశ్ తెలుగు కీర్తి కిరీటి జాతీయ పురస్కారం అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాకారులకు జాతీయ పురస్కారాలు అందించారు. ఇందులో భాగంగా చిందు యక్షగాణం, జానపద, పౌరాణిక, పద్యనాటక రంగస్థల నాటకాల్లో రాణించిన డాక్టర్ ప్రకాశ్‌కు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పురస్కారం అందించారు.

బావిలో పడి మహిళ మృతి

కొండపాక(గజ్వేల్): మతిస్థిమితం కోల్పోయిన వివాహిత బావిలో దూకి మృతి చెందిన ఘటన కొండపాక మండలంలో చోటుచేసుకుంది. త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం..కొండపాక మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన జాలిగామ జ్యోతి(38)ని దమ్మక్కపల్లికి చెందిన మహేందర్‌తో వివాహం చేశారు. కూతురు పుట్టగానే భర్త మహేందర్ సుమారు 6 ఏళ్ల కిందట మృతి చెందాడు. దీంతో జ్యోతి కూతురుతో కలిసి సిర్సనగండ్లలోని తల్లిగారింట్లో ఉంటోంది. ఈ క్రమంలో అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోతుందేదని కుటుంబ సభ్యులు చెప్పారు. శుక్రవారం గ్రామ సమీపంలోని బావిలో దూకి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కొల్చారం(నర్సాపూర్): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. మండలపరిధిలోని వరిగుంతం గ్రామానికి చెందిన తిమ్మయ్య గారి మొగులయ్య కల్లు అమ్మేందుకు వేరే గ్రామానికి రెండు రోజుల క్రితం తన ఇంటికి తాళం వేసి వెళ్లాడు. శుక్రవారం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం గమనించాడు. పెట్టెలో దాచిన డబ్బుల కోసం వెతికాడు. ఇటీవల ధాన్యం అమ్మగా వచ్చిన రూ.85 వేల నగదుతో పాటు తులం బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయాయని వాపోయాడు. పోలీసులకు సమాచారం అందించినట్లు మొగులయ్య విలేకరులకు చెప్పాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మెదక్ మున్సిపాలిటీ: పిట్లం చెరువులో శుక్రవారం గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైనట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మృతురాలి వయసు 35 ఏళ్లు ఉంటుందని, ఎడమ చేతిపై రుకవ్వ అనే పచ్చబొట్టు ఉన్నట్టు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు మెదక్ పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ నంబరు 8712657913కు కాల్ చేయాలన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్‌సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి హరీశ్‌రావు, సుడా చైర్మన్ రవీందర్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



పరేడ్ చేస్తున్న పోలీసులు



వేడుకలను తిలకిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తొమ్మిదేళ్లలో పదింతల ఫలితం

- సంక్షేమం, అభివృద్ధి పథకాలలో ఆదర్శం
- ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- జిల్లాలో అంబరాన్నంటిన ఆవిర్భావ సంబురాలు



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: రాష్ట్రం అవతరించిన తొమ్మిదేళ్లలో పదింతల అభివృద్ధి జరిగిందని, సాగు, తాగు నీటితో పాటు, ఉపాధి కోసం పరిశ్రమల స్థాపనతో జిల్లా సర్వతోముఖాభివృద్ధిలో పయనిస్తుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దశాబ్ది వేడుకల సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు.



గోదారమ్మ పరవళ్లు

ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరంతో గోదావరి జలాలను సిద్దిపేట జిల్లాలోని గ్రామగ్రామాన పారుతున్నాయని, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, గౌరవెల్లి రిజర్వాయర్లతో గ్రామాల్లో రైతులు రెండు పంటలు పండిస్తున్నారన్నారు. 2013లో 79,539 మెట్రిక్ టన్నుల ధాన్యం పండగా, 2022లో 7,54,726 మెట్రిక్ టన్నులకు చేరిందన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రైతుబీమా ద్వారా రూ.223.75కోట్లను అందజేసినట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగును ప్రొత్సహించేందుకు నంగునూరు మండలం నర్మెటలో రూ.300కోట్లతో ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతుందన్నారు.

సంక్షేమంలో టాప్..

2013లో జిల్లాలో 1.29లక్షల మందికి రూ.200 చొప్పున రూ.3.39కోట్ల పెన్షన్‌లు ఇవ్వగా, ప్రస్తుతం 1.92లక్షల మందికి ప్రతీ నెలా రూ.40కోట్లు అందిస్తున్నామన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా ఇప్పటి వరకు 36,738 మందికి రూ.340 కోట్లను అందించామన్నారు. గొల్లకుర్మలకు సబ్సిడీపై 15,720 యూనిట్ల గొర్రెలు అందించామని, రెండో విడతలో మరో 17వేల మందికి అందించనున్నట్లు తెలిపారు. 3,711 మంది మత్స్యకారులకు సబ్సిడీ వాహనాలు, చేపల అమ్మకం యూనిట్లు, 12 వేల మందికి కొత్తగా సభ్యత్వం ఇచ్చామన్నారు. నాయీ బ్రాహ్మణులు, రజకులు, చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సిద్దిపేటలో మోడల్ రైతు బజార్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, గజ్వేల్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లను ఏర్పాటు చేసుకున్నామన్నారు. రూ.665కోట్లతో 20 భారీ పరిశ్రమలు, రూ.92కోట్లతో 13 మధ్యతరహా, రూ.259కోట్లతో 631 చిన్నతరహా పరిశ్రమలు స్థాపనతో 23వేల మందికి ఉపాధి లభించిందని ఆయన వివరించారు.

అవార్డుల పంట

జాతీయ స్థాయిలో ఫైవ్ స్టార్ రేటింగ్‌తో మన పల్లెలు ఆదర్శంగా నిలిచాయని, ఇప్పటి వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో 25 అవార్డులు వచ్చాయన్నారు. రూ.301 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తడి, పొడి, హానికర చెత్తతో సీఎన్‌జీ గ్యాస్ ఉత్పత్తి, సేంద్రియ ఎరువు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలో 6.4శాతం ఉనన పచ్చదనాన్ని 13.7 శాతానికి విస్తరించామని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 370 పడకల నుంచి 880 పడకలకు పెరిగాయన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మరో 950 పడకలు అందుబాటులోకి రానున్నాయన్నారు. రూ.126కోట్లతో పాఠశాలల అభివృద్ధి జరిగిందన్నారు. నిరుద్యోగులకు ఉచిత శిక్షణ అందించడంతో దాదాపు 300 మంది పోలీసు ఉద్యోగాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులకు అభినందనలు తెలియజేశారు.





ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సిద్దిపేటజోన్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు శుక్రవారం సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో అట్టహాసంగా జరిగాయి. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. వేడుకల్లో పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

తిట్టినవారే వేనోళ్లతో పొగుడుతున్నరు

ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: తెలంగాణొస్తే నక్సలైట్లు రాజ్యమేలుతరు.. అంతా చీకటైపోతది. ముస్లింల రాజ్యమొస్తది.. అంటూ తిట్టినోళ్లే నేడు వేనోళ్లతో పొగుడుతున్నారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖా మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రి హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ ప్రాంగణంలో 60మంది దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ కోసం కొట్లాడింది ఎవరు, సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నదెవరో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి దివ్యాంగులకు ఉచితంగా స్కూటీలను పంపిణీ చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కులసంఘ భవనాలకు కేటాయించిన స్థలాల సర్టిఫికెట్లను ఆయన పంపిణీ చేశారు.




ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరుతో కలిసి స్కూటీలను పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

కార్యక్రమంలో ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, రైతుబంధు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్, బీఆర్‌ఎస్ గజ్వేల్ మండలశాఖ అధ్యక్షుడు బెండ మధు, పట్టణశాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మర్కుక్ కరుణాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కిలేడి

అధిక వడ్డీ ఆశచూపి ఓ మహిళ వద్ద రూ.41.40 లక్షలు కాజేసిన వైనం



మెదక్‌జోన్: అధిక వడ్డీ ఆశ చూపిన ఓ కిలాడీ లేడి ఓ మహిళ వద్ద నుంచి మూడేళ్లలో పలు విడతలుగా రూ.41.40 లక్షలు తీసుకుంది. తీరా ఆ డబ్బు ఇవ్వాలని అడిగితే నాకు నువ్వు ఏ డబ్బు ఇవ్వలేదంటూ బుకాయిస్తుందని సదరు మహిళ కన్నీటి పర్యంతమవుతోంది. మెదక్‌లోని జేఎన్‌రోడ్డులో నివాసముండే మద్దిబోయిన కృష్ణవేణి-హన్మంత్ దంపతులకు పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లిలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో కొంతకాలం క్రితం 2 ఎకరాల భూమి అమ్మగా రూ.60 లక్షలు వచ్చాయి. తెలిసిన వారి డబ్బు వడ్డీకి ఇస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే కృష్ణవేణికి పొడ్చన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ ద్వారా గజ్వేల్‌కు చెందిన వడ్డీవ్యాపారం చేసే ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. నీవద్ద ఎంత డబ్బు ఉన్నా నాకు ఇస్తే అంత ఎక్కువ వడ్డీ ఇప్పిస్తానంటూ ఆ మహిళ చెప్పిన మాయమాటలు కృష్ణవేణి నమ్మింది. మూడేళ్ల వ్యవధిలో భర్తకు తెలియకుండా కృష్ణవేణి ఏకంగా రూ.32 లక్షలు ముట్టజెప్పింది. తన డబ్బు ఇవ్వమని సదరు మహిళను కృష్ణవేణి నిలదీయగా, వడ్డీతో సహా ఇస్తానని, రూ.7.20 లక్షలు ఇస్తే చిట్టీ ముగుస్తుందని, రాగానే ఇస్తానని చెప్పింది. అనుమానం వచ్చిన కృష్ణవేణి అసలు విషయం తన భర్త హన్మంత్, ఇతర కుటుంబసభ్యులకు చెప్పింది. హన్మంత్ సదరు మహిళతో ఫోన్‌లో మాట్లాడి ఫోన్‌పే ద్వారా రూ. 7.20 లక్షలు ఆమె అకౌంట్‌కు పంపించాడు. మరో రూ. 2.20 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేస్తే రూ.41.40 లక్షలు అవుతుందని, ఇందుకు రూ.57 లక్షలు ఇస్తానని చెప్పటంతో సరేనని చెప్పి కృష్ణవేణి తన భర్త, కొడుకు తీసుకుని గజ్వేల్‌లో ఉంటున్న ఆ మహిళ ఇంటికి వెళ్లింది. పలు నంబర్ల నుంచి ఫోన్ పే ద్వారా మరో రూ.2.20 లక్షలు పంపించారు. అయితే తీరా అనుకున్న సమయానికి డబ్బు అడిగితే మీరు నాకు ఏ డబ్బు ఇవ్వలేదంటూ సదరు మహిళ బుకాయించిందని బాధితులు వాపోయారు. దీంతో చేసేది లేక గజ్వేల్ సీఐకి గతనెల 26న ఫిర్యాదు చేసినట్లుబాధితులు పేర్కొన్నారు. కాగా సదరు మహిళను సీఐ స్టేషన్‌కు పిలిపించి విచారించగా, నాకు డబ్బులు ఇవ్వలేదని, వారివద్ద సాక్ష్యం ఉంటే కోర్టుకు వెళ్లమని చెప్పినట్టు గజ్వేల్ సీఐ తెలిపారు. ఈ విషయంపై మెదక్ పోలీస్‌స్టేషన్ లోనే ఫిర్యాదు చేసుకోవాలని సీఐ చెప్పారు. దీంతో బాధితులు మెదక్ ఎస్పీకి కలిసి ఫిర్యాదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

గాంధీలో..

జిన్నారం(పటాన్‌చెరు): అక్రమ సంబంధాలు పెట్టుకోవడాన్ని ప్రశ్నించిన భర్తపై భార్య డీజిల్ పోసి హత్య చేసేందుకు యత్నించిన ఘటన జిన్నారం మండలం ఊట్ల గ్రామ పంచాయతీ పరిధి రాంనగర్ కాలనీలో మే 27న జరిగిన విషయం తెలిసిందే. కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రాంనగర్ కాలనీకి చెందిన నర్సింహులు(35)కు యాదమ్మకు 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. భార్య యాదమ్మ ఇతర వ్యక్తులతో అక్రమ సంబంధం పెట్టుకోవటంతో భర్త నర్సింహులు ఆమెను తరచూ మందలిస్తున్నాడు. కాగా మే 27వ తేదీ రాత్రి భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. భర్తను వదిలించుకోవాలని చూసిన భార్య యాదమ్మ రాత్రి భర్త నిద్రిస్తున్న సమయంలో అతడిపై డీజిల్ పోసి నిప్పంటించింది. నర్సింహులు కాలిన గాయాలతో బయటకు రావటంతో చుట్టుపక్కల వారు గమనించి ఆతడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. నర్సింహులు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నర్సింహులు మృతి పట్ల గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. హత్య చేసిన భార్య యాదమ్మను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



నర్సింహులు (ఫైల్)

ఆర్వీఎం ఆస్పత్రిలో..

వర్గల్(గజ్వేల్): బైక్ చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. గౌరారం ఎస్ఐ సంపత్‌కుమార్ వివరాల ప్రకారం.. గత నెల 17న సీతారాంపల్లికి చెందిన రాజపేట కనకరాజు(40) మరో వ్యక్తితో కలిసి బైక్ మీద అచ్చాయిపల్లిలో వివాహానికి బయల్దేరాడు. బైకు సీతారాంపల్లి శివారులో అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన కనకరాజును ఆర్వీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య భార్గవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు.



కనకరాజు మృతదేహం

గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో..

దుబ్బాక: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని మహ్మద్‌షాపూర్‌లో జరిగింది. ఎస్ఐ చైతన్య రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మహ్మద్‌షాపూర్ గ్రామానికి చెందిన కావేటి రవీందర్(50) గత నెల 20 తేదీన బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి క్రింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతనిని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహామేరకు మెరుగైనా చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి రవీందర్ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుడు మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రవీందర్ (ఫైల్)

సెల్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్

- తెలంగాణ వచ్చినా.. న్యాయం జరగలేదని ఆరోపణ
- నచ్చజెప్పి కిందకి దింపిన నాయకులు, పోలీసులు


జిన్నారం(పటాన్‌చెరు): తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు తమకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆరోపిస్తూ ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. ఈ ఘటన గుమ్మడిదల గ్రామంలో శుక్రవారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మడిదల గ్రామానికి చెందిన అన్వర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు తమకు ఎలాంటి న్యాయం జరగటం లేదని ఆరోపిస్తూ సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. నిరుపేద కుటుంబమైన తమకు డబుల్‌బెడ్ రూం, మూడెకరాల భూమి ఇవ్వలేదని ఆరోపించాడు. సెల్‌టవర్ ఎక్కిన యువకుడిని కిందికి దింపేందుకు పోలీసులుయ త్నించారు. జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్ చొరవతీసుకొని సెల్‌టవర్ ఎక్కి అతడితో మాట్లాడాడు. న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కిందికి దిగాడు. అనంతరం యువకుడు అన్వర్ మాట్లాడుతూ ఉద్యమంలో తాము కూడా పాల్గొన్నామని, తమకు మాత్రం తొమ్మిది ఏళ్ల తెలంగాణలో ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ప్రభుత్వం స్పందించి నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇల్లు, మూడెకరాలు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశాడు.



మాట్లాడుతున్న అన్వర్

ఆర్థిక సమస్యలతో గృహిణి ఆత్మహత్య

మనోహరాబాద్(తూప్రాన్): ఆర్థిక సమస్యలతో ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...మండలపరిధిలోని కాళ్ళకల్‌కు చెందిన చెనిగారపు స్వాతి(30) ఆర్థిక సమస్యలతో గురువారం ఇంట్లోనే విషం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం మేడ్చల్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి ఒక కూతురు, కుమారుడున్నారు.



స్వాతి(ఫైల్)

పశువులపై పోలీసుల ఆరా

చేర్యాల(సిద్దిపేట): 57 పశువులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో చుంచనకోట గ్రామ శివారులోని గుట్టల్లో పశువులు ఉన్నాయని వచ్చిన సమాచారం మేరకు వెటర్నరీ వైద్యుడు మనోహర్‌తో కలిసి అక్కడికి వెళ్లి చూడగా 50 ఎడ్లు, 7 కోడెదూడలు ఉన్నాయి. అక్కడ ఉన్న 20 మంది చుంచనకోట గ్రామ రైతులు, వేరే వ్యక్తులను ఈ పశువులు ఇక్కడకు ఎలా వచ్చాయని విచారించగా, కొనుగోలు చేశామన్నారు. అయితే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, విచారణ అనంతరం తిరిగి వాటిని రైతులకు అప్పగిస్తామన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

సంగారెడ్డి టౌన్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. శుక్రవారం పోతిరెడ్డిపల్లి చౌరస్తా సమీపంలో నేషనల్ హైవేపై గుర్తు తెలియని వృద్ధుడు (65) రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో చౌరస్తా నుంచి సదాశివపేట వెళుతున్న క్రేన్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు న మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు బురిడీ

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో ఇద్దరు మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మోసపోయారు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పరిధిలోని ప్రణీత్ ప్రణవ్ ప్రనోరమకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి మే 10వ తేదీన పార్ట్ టైం జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో ఆమె తన వివరాలను నమోదు చేసింది. టాస్క్ పేరిట నగదు పెట్టుబడి పెట్టించాడు. చివరికి తాను పెట్టిన రూ.1.20 లక్షలు, రెట్టింపైన నగదును ఇవ్వాలని మెస్సేజ్ చేయగా స్పందన రాలేదు. దీంతో ఆమె తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్ లో ఫిర్యాదు చేసి అనంతరం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా అమీన్ పూర్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మీ నగర్‌కు చెందిన మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మే 29వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం మెసేజ్ వచ్చింది. దీంతో బాధితురాలు సాఫ్ట్ వేర్ ఉద్యోగిని తన వివరాలను నమోదు చేసి అపరిచితులు చెప్పిన విధంగా నగదు పెట్టుబడి పెట్టింది. చివరకు తాను పెట్టిన రూ.8.40 లక్షలు, రెట్టింపైన నగదును ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్టు గ్రహించి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు.